# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 05 | సంచిక : 025
పేజీలు : 08 | వెల: రూ.5/-
బుధవారం
డిసెంబర్ 31, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net


## సేవే పరమావధి..

విశ్రాంత ఆచార్యులు
గడ్డం భాస్కర్



8లో..

# చైతన్య దీప్తి
# ఓరుగల్లు రూపశిల్పి



వివరాలు2లో..

- గ్రేటర్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్
- సరికొత్త యాప్‌తో వినూత్న సంస్కరణలు
- పరుగులు పెడుతున్న అభివృద్ధి పనులు
- ఆదాయం పెంచేలా నిరంతరం పర్యవేక్షణ
- అధికారులు, ఉద్యోగుల సంక్షేమానికి చర్యలు
- వరంగల్ మహా నగర పాలక సంస్థకు విశిష్ట సేవలు



చాహత్ బాజ్ పాయ్.. పరిచయం అక్కరలేని ఐఏఎస్ అధికారి. వరంగల్ మహానగరానికి దిక్సూచి. ప్రధాన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న చైతన్య దీప్తి. సరికొత్త యాప్‌తో వినూత్న సంస్కరణలకు శ్రీకారం చుడుతూనే బల్దియా ఆదాయం పెంచేలా నిరంతరం శ్రమిస్తున్నారు. అధికారులు, ఉద్యోగుల సంక్షేమానికి బాటలు వేస్తున్న ఆమె అభివృద్ధి పనులను పరుగులు పెట్టిస్తున్నారు. భద్రకాళి బండ్ పనుల్లో వేగం పెంచిన ఆమె.. స్మార్ట్ సిటీ పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేయించేందుకు శ్రమిస్తున్నారు. అనధికార, అక్రమ భవన నిర్మాణాలపై కొరడా ఝులిపిస్తున్నారు. అధునాతన, బహుళ అంతస్తుల వరంగల్ బస్ స్టాండ్ నిర్మాణ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేందుకు ఆరాటపడుతున్నారు. చారిత్రక ఓరుగల్లును చెత్త రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు అనునిత్యం పాటు పడుతున్నారు. వరంగల్ మహానగర పాలక సంస్థ కమిషనర్‌గా చాహత్ బాజ్ పాయ్ బాధ్యతలు చేపట్టిన నాటినుంచి అభివృద్ధే లక్ష్యంగా అడుగులు వేస్తూ అనతి కాలంలోనే ఓరుగల్లు ప్రజలతోపాటు సిబ్బంది, అధికారుల అభిమానాన్ని చూరగొన్నారు. ఓరుగల్లుపై తనదైన మార్క్ చూపించేందుకు అలుపెరుగని కృషి చేస్తున్నారు.



8లో..

## జాతరకు పకడ్బందీ ఏర్పాట్లు

- ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి
- కలెక్టర్ తో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష

## అంధకారంలో యూబీఐ

- బకాయిల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేత
- సెల్ ఫోన్ వెలుతురులో బ్యాంకు సేవలు




## ఎమ్మెల్యే 'నాయిని' నూతన సంవత్సర శుభాకాంక్షలు



నూతన సంవత్సరం సందర్భంగా హనుమకొండ జిల్లా, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు, అధికారులకు స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరం ప్రతి కుటుంబానికి ఆరోగ్యం, సంతోషం, అభివృద్ధిని తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రజల సహకారంతో వరంగల్ పశ్చిమ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్తామని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు. 2025 సంవత్సరం జిల్లా వ్యాప్తంగా అభివృద్ధికి, ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకు కీలకంగా నిలిచిందని ఆయన పేర్కొన్నారు.

–వరంగల్ వాయిస్, హనుమకొండ



గడ్డం కేశవమూర్తి

చాహత్ బాజ్ పాయ్.. పరిచయం అక్కరలేని ఐఏఎస్ అధికారి. వరంగల్ మహానగరంలో ప్రధాన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న చైతన్య దీప్తి. ప్రజా సమస్యలను దశలవారీగా పరిష్క రిస్తూ, నగరాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారు. మహా నగరంలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తూనే.. అనధికార భవన నిర్మాణాలు, అక్రమ కట్టడాలపై కొరడా ఝులిపిస్తున్నారు. భద్రకాళి బండ్ పనుల్లో వేగం పెంచిన ఆమె.. స్మార్ట్ సిటీకి సంబంధించిన అభివృద్ధి పనులను పూర్తి చేయిస్తున్నారు. మరోవైపు వరంగల్ ఆర్టీసీ బస్ స్టేషన్ పాత స్థలంలో అధునాతన బహుళ అంతస్తు నిర్మాణ పనులు నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేందుకు ఆరాటపడుతున్నారు.

# చైతన్య దీప్తి
# ఓరుగల్లు రూపశిల్పి

- గ్రేటర్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్
- సరికొత్త యాప్‌తో వినూత్న సంస్కరణలు
- పరుగులు పెడుతున్న అభివృద్ధి పనులు
- ఆదాయం పెంచేలా నిరంతరం పర్యవేక్షణ
- అధికారులు, ఉద్యోగుల సంక్షేమానికి చర్యలు
- వరంగల్ మహా నగర పాలక సంస్థకు విశిష్ట సేవలు

కాకతీయ మ్యూజికల్ గార్డెన్ అభివృద్ధి పనుల పూర్తితో పాటు, చారిత్రక ఓరుగల్లును చెత్త రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు అనునిత్యం పాటు పడుతున్నారు. వరంగల్ మహానగర పాలక సంస్థ కమిషనర్ గా 13 జూన్ 2025లో బాధ్యతలు చేపట్టిన చాహత్ బాజ్ పాయ్ అనతి కాలంలోనే ఓరుగల్లు ప్రజల అభిమానం చూరగొన్నారు.

## మై జీడబ్ల్యూఎంసీ యాప్..

ప్రతి ఒక్కరిలోనూ ప్రతిభ ఉంటుంది. దాన్ని గుర్తించాలి. అందులో నిష్ణాతులు కావడానికి కష్టపడాలి. అప్పుడే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోగలం. మహిళలు ఎందులోనూ తక్కువ కాదని.. సంకల్పిస్తే కలలను సాకారం చేయగలరనే విశ్వాసాన్ని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ కలిగించారు. ఆత్మవిశ్వాసమే అండగా.. సంకల్ప బలంతో ముందుకెళ్తున్న ఆమె వరంగల్ మహానగర ప్రగతిలో తన మార్క్ ను ప్రదర్శిస్తున్నారు. ప్రతిరోజు కాలనీల్లో పర్యటిస్తూ సమస్యలు పరిష్కరిస్తున్నారు. స్వచ్ఛ ఆటోలకు రూట్ మ్యాప్ లు, రోజు వారి ట్రిప్పులను ఖరారు చేసి, చెత్త తరలింపులో జాప్యం లేకుండా చూస్తున్నారు. క్షేత్రస్థాయి పర్యటనలు, ఆకస్మిక తనిఖీలు చేస్తూ అధికారులు, ఉద్యోగుల్లో వణుకు పుట్టిస్తున్నారు. ప్రజావాణిలో అర్జీదారులనుంచి నేరుగా వినతులు స్వీకరిస్తూ.. సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నారు. నగరపాలక సంస్థ పౌర సేవల్లో సులభతరం, జవాబుదారితనం పెంచేందుకు మై జీడబ్ల్యూఎంసీ యాప్ ను ఆధునీకరించి, సేవలను విస్తృతం చేశారు. ఈ యాప్ ను బల్దియాలోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ కు అనుసంధానం చేశారు. అదేవిధంగా, బయో కంపోస్ట్ పై ఫోకస్ పెట్టారు. క్షేత్రస్థాయిలో వెలువడుతున్న చెత్తను ఎక్కడికక్కడే శుద్ధి చేయడంతో పాటు ఎరువుగా మార్చే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. వరంగల్ మహా నగర సమగ్రాభివృద్ధి కోసం నిరంతరం పాటుపడుతున్న జీడబ్ల్యూఎంసీ యువ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ స్ఫూర్తిదాయక ప్రయాణం ఇది..!

## మనసుంటే మార్గం ఉంటుంది..

ప్రజావాణిలో ఎవరైనా నేరుగా వచ్చి వాళ్ల సమస్యలు చెప్పుకునే సౌలభ్యాన్ని కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ కల్పించారు. పలు డివిజన్ల లో పేరుకు పోయిన తాగునీరు, విద్యుత్, రోడ్లు, డ్రైనేజీ తదితర సమస్యలను సత్వరం పరిష్కరిస్తున్నారు. వరంగల్ మహా నగరంలో లీకేజీలపై దృష్టి సారించిన ఆమె తాగునీటి సమస్య లేకుండా చూస్తున్నారు. అదేవిధంగా పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించారు. తడి, పొడి చెత్తను డోర్ టు డోర్ రోజు సేకరించే విధంగా క్షేత్రస్థాయిలో నిత్య పర్యవేక్షణ చేస్తున్నారు. సాంకేతికత యాప్ లను ఉపయోగించి ఎక్కడ సమస్య ఉందో తెలుసుకుని వాటిని పరిష్కరిస్తున్నారు. ముఖ్యంగా పాలనలో మరింత సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ప్రజా సమస్యలకు పరిష్కారం చూపుతున్నారు. వరంగల్ సిటీని స్మార్ట్ నగరంగా తీర్చిదిద్దేందుకు చాహత్ బాజ్ పాయ్ నిర్విరామ కృషి చేస్తున్నారు. ప్లాస్టిక్ కవర్లు, వస్తువుల వినియోగాన్ని నియంత్రిస్తున్నారు. దోమలు, కుక్కల బెడద నివారణ కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. త్రినగరిగా ఉన్న వరంగల్, హనుమకొండ, కాజీపేట పట్టణాల్లో చిరు వ్యాపారులు, హోటల్లు, దుకాణాల యజమానులు రోడ్ల పైన చెత్త పడేస్తే జరిమాణాలు విధిస్తు, ట్రేడ్ లైసెన్సులు రద్దు చేస్తున్నారు. భారీ వర్షాలు కురిసిన కురిసిన సమయంలో కార్పొరేషన్ యంత్రాంగాన్ని అన్ని విధాల సమాయత్త పరిచి ఎలాంటి ప్రాణ నష్టం జరగకుండా కమిషనర్ జాగ్రత్తలు తీసుకున్నారు.



## రూపురేఖలు మారుతాయి..

రానున్న రోజుల్లో వరంగల్ మహా నగర రూపురేఖలు మార్చనున్నట్లు కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ ప్రకటిస్తున్నారు. గోవా స్ఫూర్తితో స్వచ్ఛ ఓరుగల్లుకు కృషి చేస్తున్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ లు, స్మార్ట్ వాటర్ డ్రైనేజీ, మామునూరు విమానాశ్రయం, ఔటర్, ఇన్నర్ రింగ్ రోడ్లు ఏర్పడితే నగరానికి పరిశ్రమలు, ఐటీ కంపెనీలు వస్తాయంటారు. నగరాభివృద్ధికి అధికారులంతా సమష్టిగా కృషి చేయాలని, సుందరీకరణ పనులపై శ్రద్ధ పెట్టాలని ఆమె పిలుపునిచ్చారు. ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, శానిటేషన్, రెవెన్యూ తదితర శాఖలపై ప్రత్యేక దృష్టి సారించిన చాహత్ బాజ్ పాయ్ గ్రేటర్ పాలనను గాడిలో పెట్టారు. నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులను పూర్తిచేస్తూనే.. నాణ్యత ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకున్నారు.











## ప్రొఫైల్...

మధ్యప్రదేశ్ రాష్ట్రం గ్వాలియర్ లో 1994 డిసెంబర్ 14 న ఉష–రవి ప్రకాష్ బాజ్ పాయ్ దంపతులకు చాహత్ బాజ్ పాయ్ జన్మించారు. వీరి తల్లి గృహిణి కాగా, తండ్రి సీనియర్ ఇంజనీర్ గా పని చేస్తున్నారు. అన్నయ్య రజత్ బాజ్ పాయ్ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో మేనేజర్ గా పనిచేస్తున్నారు. చాహత్ గుణ జిల్లాలోని సత్యసాయి విద్యాలయంలో పదో తరగతి చదివారు. ఇంటర్ భారతీయ విద్యా నికేతన్ లో పూర్తి చేశారు. కాన్పూర్ ఐఐటీలో ఎలక్ట్రానిక్ ఇంజనీరింగ్ చదివారు. అనంతరం సివిల్ సర్వీసెస్ పరీక్షలు రాసి 2019లో 59వ ర్యాంక్ సాధించి ఐఏఎస్ కు ఎంపికయ్యారు. 2021 నవంబర్ 29న సహచర ఐఏఎస్ అధికారి ప్రస్తుత ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డిని వివాహం చేసుకున్నారు. వీరికి కూతురు మనస్వి జన్మించారు. పశ్చిమగోదావరి జిల్లాలో ట్రైనీ ఐఏఎస్ గా శిక్షణ పొందిన ఆమె తొలుత ఆంధ్రప్రదేశ్ లోని నంద్యాల సబ్ కలెక్టర్ గా పని చేశారు. అనంతరం తెలంగాణ ఐఏఎస్ క్యాడర్ కు వచ్చారు. గతంలో అసిఫాబాద్ అడిషనల్ కలెక్టర్ గా , అదిలాబాద్ జిల్లా ఉట్నూరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిగా సేవలందించారు. 2024 ఆగస్టు నుంచి 2025 జూన్ 12 వరకు కరీంనగర్ నగర పాలక సంస్థ కమిషనర్ గా విధులు నిర్వర్తించారు. 13 జూన్ 2025 నుంచి వరంగల్ మహానగర పాలక సంస్థ కమిషనర్ గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

# శ్రీ చైతన్య 'సీఓఐపీఎల్' విద్యార్థుల ప్రభంజనం

● ర్యాంకులు సాధించిన విద్యార్థులకు సన్మానం




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో హనుమకొండ స్నేహ నగర్‌లోని శ్రీ చైతన్య సీఓఐపీఎల్ బ్రాంచ్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి ప్రభంజనం సృష్టించారు. ఐఐటీ, ఎన్ఐటీ, నీట్ పరీక్షల్లో అత్యుత్తమ ర్యాంకులు సాధించిన 40 మందికి పైగా పూర్వ విద్యార్థులను, వారి తల్లిదండ్రులను శ్యామల గార్డెన్స్‌లో నిర్వహించిన సన్మాన సభలో ఘనంగా సత్కరించారు. ఈ విద్యాసంస్థ నుంచి 34 మంది విద్యార్థులు ఐఐటీ, ఎన్ఐటీలలో ప్రవేశాలు పొందగా, మరో 6 మంది విద్యార్థులు నీట్ పరీక్షలో సత్తా చాటి వైద్య కళాశాలల్లో సీట్లు సాధించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏసీబీ ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ.. క్రమశిక్షణతో కూడిన విద్యాభ్యాసమే విద్యార్థులను ఉన్నత శిఖరాలకు చేరుస్తుందని అన్నారు. మరో అతిథి డాక్టర్ మల్లాడి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు శ్రీ చైతన్య విద్యాసంస్థలు కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తున్నాయని కొనియాడారు. శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్మన్ శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య మాట్లాడుతూ.. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని, రాబోయే రోజుల్లో మరిన్ని అద్భుత ఫలితాలు సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ సురేఖ మాట్లాడుతూ.. పక్కా ప్రణాళిక, ఉపాధ్యాయుల కృషి, తల్లిదండ్రుల ప్రోత్సాహం వల్లే ఈ విజయం సాధ్యమైందని పేర్కొన్నారు. ఈ వేడుకలో డీజీఎం చేతన్, కోఆర్డినేటర్ శివ కోటేశ్వర్, ఇంచార్జులు ఉదయ్, ఆనంద్, శ్రీకాంత్, అనూష, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# వన్నాల వెంకటరమణ ఉదారత

## 'వాక్' ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం



**వరంగల్ వాయిస్, దేశాయిపేట:** కష్టాల్లో ఉన్న వారికి అండగా నిలవడంలో డాక్టర్ వన్నాల వెంకటరమణ మరోసారి తన ఉదారతను చాటుకున్నారు. దేశాయిపేట బీజేపీ మండల అధ్యక్షుడు విప్ప సుధాకర్ కుమార్తె హర్షిక గత నెలలో తీవ్ర అనారోగ్యానికి గురై గార్డియన్ ఆసుపత్రిలో చికిత్స పొందిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో డాక్టర్ వెంకటరమణ అందుబాటులో లేకపోయినప్పటికీ, ఫోన్ ద్వారా వైద్యులతో మాట్లాడి హర్షిక ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. అప్పట్లో ఇచ్చిన మాట ప్రకారం, నిన్న సుధాకర్ నివాసానికి వెళ్లిన డాక్టర్ వెంకటరమణ, హర్షిక ఆరోగ్య యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వాక్ ఫౌండేషన్ తరపున రూ.12,000 ఆర్థిక సహాయాన్ని చెక్కు రూపంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో కాశీబుగ్గ మండల అధ్యక్షుడు అపురూప రజనీష్ నేత, సీనియర్ నాయకులు కొంతం సంగీత, 13వ డివిజన్ మాజీ అధ్యక్షుడు జన్ను సుబ్రమణ్యం పాల్గొన్నారు.

# పుట్టకోట మల్లన్న ఆలయ అభివృద్ధికి కృషి చేయండి

## కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు వినతి



**వరంగల్ వాయిస్, ఐనవోలు:** మండలంలోని సింగారం కోట గండి గ్రామ పరిధిలో కొలువై ఉన్న అతి పురాతన శ్రీ మల్లికార్జున స్వామి వారి పాదాల గుడి అభివృద్ధికి కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌కు వినతి పత్రం సమర్పించారు. ఆలయ మాజీ డైరెక్టర్ సొనబోయిన సతీష్ ఢిల్లీలో మంత్రిని కలిసి ఆలయ విశిష్టతను, ప్రస్తుత అవసరాలను వివరించారు. కాకతీయులు పాలించిన పుట్ట కోటపై స్వామి వారి పాదాలు వెలసి ఉండటం సింగారం గ్రామ ప్రజలకు గర్వకారణమని సతీష్ పేర్కొన్నారు. పూర్వం ఈ కోట సమీపం నుంచి ఐలోని మల్లన్న ఆలయం వరకు సొరంగ మార్గం ఉండేదని పూర్వీకులు చెప్పినట్లు ఆయన గుర్తు చేశారు. ఈ క్షేత్రంలోని స్వామి వారి పాదాలను దర్శించుకుంటే కోరిన కోరికలు తీరుతాయని భక్తుల అచంచల విశ్వాసమని తెలిపారు. ఆలయ అభివృద్ధి కోసం దాతల సహకారంతో ఇప్పటికే నీటి బోరు సౌకర్యం కల్పించామని, ప్రస్తుతం టైల్స్ వేయడం, రంగులు వేయడం, స్వామివారి చిత్రపటాల ఏర్పాటు వంటి పనులు కొనసాగుతున్నాయని వివరించారు. భక్తుల కోసం మరిన్ని మౌలిక వసతులు కల్పించాల్సిన అవసరం ఉందని ఆయన మంత్రికి విన్నవించారు. ఈ సందర్భంగా ఆలయ చిత్రపటాలు, ప్రెస్ క్లిప్పింగ్‌లను మంత్రికి చూపించిన సతీష్, ఆలయంలో ధూప-దీప-నైవేద్యాల నిర్వహణకు సహకరించాలని కోరారు. అలాగే సింగారం గ్రామంలోని ఈ క్షేత్రాన్ని దర్శించాల్సిందిగా మంత్రిని ఆహ్వానించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన బండి సంజయ్ కుమార్.. సంబంధిత శాఖలతో మాట్లాడి ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.

# వాసవి క్లబ్ జిల్లా వైస్ గవర్నర్‌గా గుండా రవీందర్ ప్రమాణ స్వీకారం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** స్థానిక ఎంకే నాయుడు కన్వెన్షన్ హాల్‌లో నిన్న రాత్రి జరిగిన వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ 'ఆత్మీయ సమ్మేళనం' వైభవంగా నిర్వహించబడింది. ఈ వేదికపై వాసవి క్లబ్స్ జిల్లా వీ101ఏ వైస్ గవర్నర్‌గా డాక్టర్ గుండా రవీందర్ 2026 సంవత్సరానికిగాను ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన పాత సుదర్శన్, జిల్లా గవర్నర్ మంచాల విజయ్ కుమార్ ఆయన చేత ప్రమాణ స్వీకారం చేయించారు. వైస్ గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం డాక్టర్ గుండా రవీందర్ మాట్లాడుతూ.. 2026 సంవత్సరంలో వాసవి క్లబ్ వీ101ఏ ద్వారా జిల్లావ్యాప్తంగా అనేక ఉన్నతమైన సేవా కార్యక్రమాలను చేపట్టనున్నట్లు ప్రకటించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాల నిర్వహణ. పేదలకు అన్నదానము మరియు వేసవిలో చలివేంద్రాల ఏర్పాటు. సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ స్కీం కింద మరియు డ్వాక్రా గ్రూపులకు రుణ సౌకర్యం కల్పించడం. 'సరస్వతి పథకం' ద్వారా నిరుపేద విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాల పంపిణీ. సమాజంలోని అట్టడుగు వర్గాలకు వాసవి క్లబ్ సేవలను చేరువ చేయడమే తమ ప్రథమ కర్తవ్యమని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. వాసవి క్లబ్ బాధ్యులు, సభ్యులు ప్రముఖులు పాల్గొన్నారు.

# గణపురం సీఐని కలిసిన సర్పంచ్ దంపతులు



**వరంగల్ వాయిస్, గణపురం :** స్థానిక సర్కిల్ ఇన్స్పెక్టర్ కరుణాకర్ రావును మంగళవారం గణపురం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ కట్కూరి రాధిక–శ్రీనివాస్ దంపతులు మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక సీఐ కార్యాలయంలో జరిగిన ఈ భేటీలో సీఐని శాలువాతో ఘనంగా సన్మానించి, మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ రాధికా శ్రీనివాస్ మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ అభివృద్ధి పనుల్లోనూ, శాంతిభద్రతల పరిరక్షణలోనూ పోలీసు శాఖ తరపున తమకు పూర్తి సహాయ సహకారాలు అందించాలని కోరారు. దీనిపై సీఐ కరుణాకర్ సానుకూలంగా స్పందిస్తూ.. పాలనపరమైన విషయాల్లోనూ, గ్రామాభివృద్ధిలోనూ పోలీసు శాఖ నుంచి ఎల్లప్పుడూ సహకారం ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# చదువుకు పేదరికం అడ్డుకాదు

■ 'విద్య - విలువ' పై అవగాహన సదస్సు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** "చినిగిన చొక్కా అయినా తొడుక్కో.. కానీ ఒక మంచి పుస్తకం కొనుక్కో" అన్న నినాదంతో విద్యార్థులు చదువుపై మక్కువ పెంచుకోవాలని వడ్డేపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు లునావత్ నరేందర్ నాయక్ సూచించారు. మంగళవారం పాఠశాల ఆవరణలో విద్యార్థులకు 'విద్య – విలువ' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన స్వర్ణ భారతి యూత్ వెల్ఫేర్ సొసైటీ కార్యదర్శి, సామాజిక సేవకులు డాక్టర్ పాలడుగుల సురేందర్ మాట్లాడుతూ.. చదువుకోవడానికి పేదరికం ఎన్నడూ అడ్డుకాకూడదని అన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అనేక సంక్షేమ పథకాలను ఉపయోగించుకుని, సెల్ ఫోన్లకు దూరంగా ఉంటూ విద్యార్థులు సన్మార్గంలో పయనించాలని కోరారు. చదువుతో పాటు చిత్రలేఖనం, ఆటపాటల్లోనూ నైపుణ్యం సాధించాలని పిలుపునిచ్చారు. నరేందర్ నాయక్ హెచ్.ఎం నరేందర్ నాయక్ మాట్లాడుతూ.. తాము చదువుకునే రోజుల్లో వసతులు తక్కువగా ఉన్నా, క్రమశిక్షణతో చదివి నేడు ఈ స్థాయికి చేరుకున్నామని తెలిపారు. కాకతీయ అక్షర దీపికలో ఉత్తమ ఎం.ఎల్.ఏ (మహిళా అక్షరాస్యత)గా, ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షునిగా, బాల్ బ్యాడ్మింటన్ కెప్టెన్‌గా రాణించడానికి చదువే కారణమని పేర్కొన్నారు. బాబాసాహెబ్ డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ చూపిన మార్గంలో విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, విద్యార్థుల సౌకర్యార్థం తాము ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని హామీ ఇచ్చారు. అక్షిత తెలుగు దినపత్రిక ప్రతినిధి కోడిపాక శ్రీకాంత్ మాట్లాడుతూ.. విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగి జీవితంలో గొప్పగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు స్వామి, లక్ష్మి, ట్రైనింగ్ టీచర్లు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# పంచగిరి లక్ష్మి కుటుంబానికి సిరంగి సంతోష్ పరామర్శ



**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణానికి చెందిన పంచగిరి లక్ష్మి ఇటీవల మృతి చెందగా, విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ సిరంగి సంతోష్ కుమార్ వారి నివాసానికి వెళ్లి నివాళులర్పించారు. మృతురాలి చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించిన ఆయన, కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పరకాల పట్టణ అధ్యక్షుడు గాజుల నిరంజన్, బాసాని సోమరాజు, పంచగిరి శ్రీనివాస్, కోడెల లింగమూర్తి, మెంతుల సురేష్ తదితరులు పాల్గొని మృతురాలి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

# అంగన్‌వాడీ టీచర్లకు 'ప్రీ స్కూల్' శిక్షణ



**వరంగల్ వాయిస్, పరకాల :** ఐసీడీఎస్ పరకాల ప్రాజెక్టు, నాగారం సెక్టార్ ఆధ్వర్యంలో 'రాకెట్ లెర్నింగ్ ఆర్గనైజేషన్' సహకారంతో అంగన్‌వాడీ టీచర్లకు ప్రీ స్కూల్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మిషన్ బాల ఉద్యమంలో భాగంగా అలియాబాద్ అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన ఈ శిక్షణకు గ్రామ సర్పంచ్ శాతరాశి సనత్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. మాతా–శిశు సంక్షేమానికి ఐసిడిఎస్ అందిస్తున్న సేవలు ఎంతో కీలకమని, గ్రామ ప్రజలు ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రానికి అవసరమైన మౌలిక వసతుల కల్పనకు తన వంతు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం నూతన సర్పంచ్‌గా ఎన్నికైన సనత్ కుమార్‌ను ఐసిడిఎస్ నాగారం సెక్టార్ బృందం ఘనంగా సన్మానించింది. ఈ కార్యక్రమంలో నాగారం సెక్టార్ సూపర్వైజర్ జె.రాణి, రాకెట్ లెర్నింగ్ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ రిజ్వానా, సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు. శిక్షణలో భాగంగా చిన్నారులకు సులభ పద్ధతుల్లో విద్యను అందించే మెళకువలను వివరించారు.

# రాష్ట్రస్థాయి క్రీడల్లో 'స్వామి' జోడు బంగారు పతకాల వేట

## జావెలిన్, డిస్కస్ త్రోలో అగ్రికల్చర్ ఆఫీసర్ ప్రతిభ



**వరంగల్ వాయిస్, రంగశాయిపేట:** హైదరాబాద్ వేదికగా రెండు రోజుల పాటు జరిగిన 'తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ మీట్'లో వరంగల్ నగరానికి చెందిన గుగులోతు స్వామి అద్భుత ప్రతిభ కనబరిచి రెండు బంగారు పతకాలను కైవసం చేసుకున్నారు. రంగశాయిపేట గణేష్ నగర్‌కు చెందిన స్వామి ప్రస్తుతం అగ్రికల్చర్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో భాగంగా నిర్వహించిన జావెలిన్ త్రో, డిస్కస్ త్రో విభాగాల్లో స్వామి ప్రథమ స్థానంలో నిలిచి రెండు గోల్డ్ మెడల్స్ సాధించారు. వృత్తిరీత్యా వ్యవసాయ అధికారిగా తీరికలేని బాధ్యతలు నిర్వహిస్తున్నప్పటికీ, క్రీడల పట్ల మక్కువతో ఆయన సాధించిన ఈ విజయం అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. రాష్ట్ర స్థాయిలో రెండు బంగారు పతకాలతో నగరం పేరు నిలబెట్టిన గుగులోతు స్వామిని రంగశాయిపేట కాలేజ్ గ్రౌండ్ వాకర్స్, స్థానిక క్రీడాకారులు ఘనంగా అభినందించారు. ఆయన మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.

# నిరుపేదలకు దుప్పట్ల పంపిణీ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని 18వ డివిజన్ క్రిస్టియన్ కాలనీలో నిరుపేదలు, వృద్ధులకు దుప్పట్ల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. మెడికల్ ఆఫీసర్ డాక్టరు వి.మోహన్ రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మీసాల ప్రకాష్ విచ్చేసి వృద్ధులకు దుప్పట్లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నూతన సంవత్సరం సందర్భంగా ఆడంబరాలకు పోకుండా, చలితో ఇబ్బంది పడుతున్న నిరుపేదలకు అండగా నిలవడం అభినందనీయమని కొనియాడారు. పేదవారి ముఖంలో చిరునవ్వు చూడటమే నిజమైన వేడుక అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రవి, డాక్టర్ తిలక్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సందెల లాజర్, అధ్యక్షులు రాధాకృష్ణ, ప్రదీప్, సత్యనారాయణ, యాకోబు, సన్నీ కుమార్, రాజు, రవి తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర కీలకం

- సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవిత
- మడికొండ పోలీస్ స్టేషన్‌లో వార్షిక తనిఖీ



**వరంగల్ వాయిస్, మడికొండ :** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మడికొండ పోలీస్ స్టేషన్‌ను సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవిత బుధవారం వార్షిక తనిఖీల్లో భాగంగా సందర్శించారు. స్టేషన్‌కు చేరుకున్న డీసీపీకి కాజీపేట ఏసీపీ పి.ప్రశాంత్ రెడ్డి, మడికొండ ఇన్స్పెక్టర్ పి.కిషన్ పూల మొక్కను అందించి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం డీసీపీ పోలీసు సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. తనిఖీల్లో భాగంగా స్టేషన్ పరిసరాలను పరిశీలించిన డీసీపీ, అధికారులతో కలిసి స్టేషన్ ఆవరణలో మామిడి చెట్టును నాటారు. అనంతరం గత మూడేళ్ల నేరాల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ముఖ్యంగా రోడ్డు ప్రమాదాలు, దొంగతనాల నివారణకు తీసుకుంటున్న చర్యల గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డీసీపీ ధార కవిత మాట్లాడుతూ.. సమాజంలో పోలీసుల ప్రతిష్ట పెరగడంలో క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బంది పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. మహిళలు, పిల్లలు, వృద్ధులు స్టేషన్‌కు వచ్చినప్పుడు వారి సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలని సూచించారు. నిరంతరం శాంతిభద్రతలను కాపాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండాలి. రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీట్ ఉన్న వ్యక్తులపై నిరంతరం నిఘా ఉంచాలి. సైబర్ నేరాలు, మహిళల భద్రత విషయంలో తక్షణమే స్పందించాలి. విధి నిర్వహణతో పాటు సిబ్బంది తమ ఆరోగ్యం పట్ల, కుటుంబ సభ్యుల పట్ల కూడా శ్రద్ధ వహించాలని డీసీపీ సూచించారు. సిబ్బందికి ఏవైనా సమస్యలు ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. కాజీపేట ఏసీపీ పి.ప్రశాంత్ రెడ్డి, ఇన్స్పెక్టర్ పి.కిషన్, ఎస్ఐలు రాజబాబు, రాజ్ కుమార్, రామ్ మోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

# 2న ఉమ్మడి జిల్లా అర్చక ఉద్యోగుల సదస్సు

## అర్చక సమస్యల పరిష్కారమే లక్ష్యం

## రాష్ట్ర అర్చక ఉద్యోగ జేఏసీ ఉపాధ్యక్షుడు టక్కర్సు సత్యం



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అర్చక ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 2న మధ్యాహ్నం 12 గంటలకు భారీ సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర అర్చక ఉద్యోగ జేఏసీ ఉపాధ్యక్షుడు టక్కర్సు సత్యం తెలిపారు. మడికొండలోని ఈనాడు కార్యాలయం పక్కన ఉన్న శ్రీ రాజరాజేశ్వర కళ్యాణ మండపంలో ఈ సమావేశం జరగనుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేవాదాయ శాఖలో పనిచేస్తున్న ఇతర ఉద్యోగులకు ట్రెజరీ ద్వారా వేతనాలు, ప్రభుత్వ ప్రయోజనాలు అందుతున్నాయని, కానీ అర్చక ఉద్యోగులకు మాత్రం చాలీచాలని వేతనాలతో అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సదస్సులో ప్రధానంగా కింది అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు. దేవాలయాల్లో 5 ఏళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న అర్చక ఉద్యోగులందరినీ వెంటనే రెగ్యులర్ చేయాలి. దేవాదాయ శాఖలో ఉన్న వివిధ రకాల వేతన విధానాలను సవరించి, నూతన చట్టం ద్వారా అందరికీ సమాన వేతనం అందించాలి. అర్చక ఉద్యోగులకు కూడా హెల్త్ కార్డులు, పెన్షన్ సౌకర్యం కల్పించాలి. వరంగల్, హనుమకొండ, ములుగు, భూపాలపల్లి, జనగామ, మహబూబాబాద్ జిల్లాల పరిధిలోని 6ఏ, 6బీ, 6సీ దేవాలయాల్లో పనిచేస్తున్న గ్రాంట్ ఇన్ ఎయిడ్, తాత్కాలిక మరియు అవుట్ సోర్సింగ్ అర్చక ఉద్యోగులందరూ ఈ సమావేశానికి విధిగా హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా అర్చక సంఘం అధ్యక్షుడు నరేష్ శర్మ, అభిలాష్ శర్మ, సిబ్బంది రణధీర్, అనీల్, శ్రీదేవి, సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అన్నారం షరీఫ్ ఉర్సు ఉత్సవాలు

## పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే నాగరాజు



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** మండలంలోని అన్నారం షరీఫ్‌లో అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించే హజ్రత్ సయ్యద్ షా అఫ్జల్ బియాబానీ (రహ్మతుల్లా అలైహి) ఉర్సు ఉత్సవాల గోడ పత్రికను బుధవారం వర్ధన్నపేట ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌లో ఆవిష్కరించారు. ఈ ఉత్సవాలు జనవరి 5, 6 తేదీల్లో వైభవంగా జరగనున్నాయని నిర్వాహకులు వెల్లడించారు. పోస్టర్ ఆవిష్కరణ అనంతరం ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ.. అన్నారం షరీఫ్ ఉర్సు ఉత్సవాలకు రాష్ట్రవ్యాప్తంగా భక్తులు భారీగా తరలివస్తారని, వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే ఈ ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షులు ఎండీ అయూబ్, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు అనిల్ రావు, మండల పార్టీ అధ్యక్షులు జాటోత్ శ్రీనివాస్ నాయక్, వక్ఫ్ బోర్డు ఇన్స్పెక్టర్ రియాజ్, సర్పంచ్ గాడిపెల్లి మహేందర్ పాల్గొన్నారు. అలాగే గ్రామ పార్టీ అధ్యక్షులు గొడుగు రమేష్, యూత్ అధ్యక్షులు గొడుగు వినయ్, వార్డు సభ్యులు రాజబాబు, రామకృష్ణ, పవన్ కళ్యాణ్, రవి, మధు, ఐపల్లి రామ్మూర్తి, అఖిల్ భార్గవ్, అవే ప్రభాకర్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# 'బీసీ' సీటులో 'ఓసీ' రాజకీయమా?

- పుట్ట మధుకు నాగుల సంతోష్ సవాల్
- మంథనిలో బహుజనవాదం.. కాళేశ్వరంలో బీసీలకు ద్రోహమా?

**వరంగల్ వాయిస్, మహాదేవపూర్ :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరం సర్పంచ్ ఎన్నిక రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తోంది. బీసీ రిజర్వేషన్‌కు కేటాయించిన స్థానంలో ఓసీ వర్గానికి చెందిన వ్యక్తిని కూర్చోబెట్టడం వెనుక పెద్ద రాజకీయ కుట్ర దాగి ఉందని బీసీ నాయకుడు నాగుల సంతోష్ సంచలన ఆరోపణలు చేశారు. ఈ మేరకు మాజీ ఎమ్మెల్యే పుట్ట మధును ఉద్దేశించి ఆయన ఘాటు ప్రశ్నలు సంధిస్తూ బహిరంగ సవాల్ విసిరారు. ఈ సందర్భంగా నాగుల సంతోష్ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా బీసీ హక్కుల గురించి మాట్లాడే పుట్ట మధు, తన సొంత నియోజకవర్గంలో మాత్రం బీసీలకు వెన్నుపోటు పొడిచారని విమర్శించారు. బీసీ రిజర్వేషన్ ఉన్న సీట్లో మోహన్ రెడ్డి అనే ఓసీ వ్యక్తిని పోటీ చేయించి గెలిపించడం బీసీ సమాజానికి చేసిన ఘోర ద్రోహమని మండిపడ్డారు. నవంబర్ 27న తాను ఫోన్ చేసినప్పుడు, "మోహన్ రెడ్డి నా వాడే, అతనికి మాట ఇచ్చాను" అని పుట్ట మధు చెప్పిన మాటలు ఈరోజు నిజమయ్యాయని గుర్తుచేశారు. బీసీ రిజర్వేషన్ సీటులో మోహన్ రెడ్డి గెలుపు వెనుక ఎవరి ఆశీర్వాదం ఉంది? ఎవరి అండతో అధికార యంత్రాంగం పనిచేసింది? అన్నది ప్రజలకు వివరించాలని సంతోష్ డిమాండ్ చేశారు. గెలిచిన తర్వాత కనీసం పుట్ట మధును కలవకపోవడం చూస్తుంటే, దీని వెనుక మరిన్ని చీకటి శక్తులు ఉన్నాయని అనుమానం వ్యక్తం చేశారు. మోహన్ రెడ్డి ప్రస్తుతం ఏ పార్టీ మనిషి?, ఎవరి అండతో ఆయన ఎన్నికల్లో గెలిచారు?, బీసీ రిజర్వేషన్ సీటులో ఓసీ వ్యక్తిని ఎందుకు కూర్చోబెట్టారు? అని పుట్ట మధును ప్రశ్నించారు. "మంథనిలో బహుజనవాదం మాట్లాడే నాయకత్వం.. కాళేశ్వరంలో ఆ వాదాన్ని ఎక్కడ పాతిపెట్టింది?" అని ఆయన ప్రశ్నించారు. ఇది కేవలం వ్యక్తిగత పోరు కాదని, కాళేశ్వరం బీసీల ఆత్మగౌరవ పోరాటమని స్పష్టం చేశారు. ఈ అంశంపై త్వరలో కాళేశ్వరంలో బహిరంగ చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని నాగుల సంతోష్ ప్రకటించారు.



# క్రీడల్లో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

■ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** మండలంలోని అన్నారం పల్లవి మోడల్ స్కూల్‌లో జరుగుతున్న 44వ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు రెండో రోజూ ఉత్సాహంగా కొనసాగాయి. బుధవారం జరిగిన ఈ పోటీలకు మాజీ ఉప ముఖ్యమంత్రి డాక్టర్ తాటికొండ రాజయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించిన అనంతరం ఆయన విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా రాజయ్య తన జీవిత ప్రస్థానాన్ని గుర్తుచేసుకుంటూ విద్యార్థుల్లో స్ఫూర్తి నింపారు. “సామాన్య పశువుల కాపరి స్థాయి నుంచి.. రాష్ట్ర స్థాయి క్రీడాకారుడిగా, పిల్లల డాక్టర్‌గా, ఆపై తెలంగాణ రాష్ట్ర మొదటి ఉప ముఖ్యమంత్రి స్థాయికి నేను ఎదగడానికి నా ఉపాధ్యాయుల ప్రోత్సాహమే కారణం” అని పేర్కొన్నారు. విద్యార్థులు కూడా ఉపాధ్యాయుల సూచనలను పాటిస్తూ చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ క్రీడలో అద్భుత ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను డాక్టర్ రాజయ్య ఈ సందర్భంగా శాలువాతో సన్మానించి అభినందించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడానికి ఇలాంటి క్రీడా పోటీలు ఎంతో దోహదపడతాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, క్రీడాకారులు మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.



**పోటీలను సందర్శించిన మాజీ ఎంఈఓ లింగారెడ్డి..**

పర్వతగిరి మండలం అన్నారం పల్లవి మోడల్ స్కూల్‌లో నిర్వహిస్తున్న 44వ రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీలను బుధవారం పర్వతగిరి మాజీ ఎంఈఓ గాయపు లింగారెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన క్రీడాకారులను పరిచయం చేసుకుని, వారిని ఉత్సాహపరిచారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పాఠశాల ప్రారంభమైన అనతి కాలంలోనే రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఆతిథ్యం ఇవ్వడం పల్లవి మోడల్ స్కూల్ యాజమాన్యానికి గర్వకారణమని కొనియాడారు. విద్యార్థులు క్రీడల్లో రాణించి జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. చదువుతో పాటు క్రీడలు శారీరక, మానసిక దృఢత్వానికి తోడ్పడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ రాచకొండ అశోక చారి, గంజి మహేందర్, కోటగిరి రమేష్, క్రీడల డైరెక్టర్, హెచ్‌ఓడీ ఆకుల రాజు, ఏఓ బైరీ అశోక్, పాఠశాల ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీపై శాసనసభలో తీర్మానం చేయాలి

• తాటిపాముల వెంకట్రాములు

**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని యధావిధిగా కొనసాగించేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని, ప్రస్తుత శాసనసభ సమావేశాల్లోనే దీనిపై తీర్మానం చేయాలని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు పన్నుతున్న కుట్రలను తీవ్రంగా ఖండించారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల పార్లమెంటులో ఆమోదించిన “వికసిత్ భారత్ రోజ్గార్ యోజన అజీవికా హామీ మిషన్ “ బిల్లును తక్షణమే రద్దు చేయాలని వెంకట్రాములు డిమాండ్ చేశారు. కొత్త చట్టం ప్రకారం కేంద్రం తన వాటాను 60 శాతానికి తగ్గించి, రాష్ట్రాల వాటాను 40 శాతానికి పెంచడం వల్ల తెలంగాణ రాష్ట్రంపై సుమారు 1500 కోట్ల రూపాయల అదనపు భారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది గ్రామీణ కూలీల పొట్ట కొట్టడమేనని విమర్శించారు. రాష్ట్రంలో జరుగుతున్న శాసనసభ సమావేశాల్లో ఈ కొత్త బిల్లు వల్ల కలిగే నష్టాలపై సమగ్రంగా చర్చించాలని వెంకట్రాములు విజ్ఞప్తి చేశారు. పాత ఉపాధి హామీ చట్టాన్నే యధావిధిగా అమలు చేయాలని కోరుతూ కేంద్రానికి గట్టి సందేశం పంపాలని కోరారు. ఉపాధి హామీ కూలీల ప్రయోజనాలను కాపాడటంలో రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని ఆయన డిమాండ్ చేశారు.



# నిధులు బారెడు.. అభివృద్ధి జానెడు

■ పరకాల పాలకులపై బీజేపీ నిప్పులు

■ నిధుల దుబారాపై డా.కాళీ ప్రసాద్, డా.సిరంగి ధ్వజం



**వరంగల్ వాయిస్, పరకాల :** పరకాల నియోజకవర్గానికి వస్తున్న కోట్ల రూపాయల నిధులు పాలకుల నిర్లక్ష్యం వల్ల వృథా అవుతున్నాయని, అభివృద్ధి మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందని బీజేపీ నేతలు తీవ్రస్థాయిలో విమర్శించారు. బుధవారం పరకాల పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు గాజుల నిరంజన్ అధ్యక్షతన జరిగిన విలేకరుల సమావేశంలో బీజేపీ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే డాక్టర్ కాళీ ప్రసాద్ రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ సిరంగి సంతోష్ కుమార్ మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంతో పాటు ప్రస్తుత కాంగ్రెస్ పాలకులు పరకాలను పూర్తిగా విస్మరించారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ప్రారంభించిన వంద పడకల ఆస్పత్రి, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు ఇప్పటికీ పూర్తికాకపోవడానికి కారణం ఏమిటని ఎమ్మెల్యేను ప్రశ్నించారు. కోట్ల రూపాయలతో కొనుగోలు చేసిన రోడ్డు క్లీనింగ్ మిషన్ వాహనాన్ని వాడకుండా పక్కన పడేయడం పాలకుల అసమర్థతకు నిదర్శనమని మండిపడ్డారు. పరకాల బస్టాండ్ కూడలి అభివృద్ధిని గాలికి వదిలేయడం వల్ల అది నిత్యం ప్రమాదాలకు కేంద్రంగా మారుతోందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. పరకాలను జిల్లా కేంద్రంగా ప్రకటించి ఉంటే ఎంతో అభివృద్ధి జరిగేదని, కానీ రాజకీయ స్వార్థం కోసం పట్టణాన్ని వెనుకబాటుకు గురిచేశారని ధ్వజమెత్తారు. వ్యాపారాలు దెబ్బతినడంతో వ్యాపారస్తులు పట్టణాన్ని వదిలి వెళ్తున్నారని, అభివృద్ధి కేవలం టాయిలెట్ బోర్డులకే పరిమితమైందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో కనీసం తట్టెడు మట్టి కూడా పోయలేదని, వస్తున్న నిధులు ఎటు మళ్లుతున్నాయో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పరకాల అభివృద్ధి చెందాలంటే రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని, కేంద్రం నుంచి నిధులు తెచ్చే సత్తా తమకే ఉందని పేర్కొన్నారు. ప్రజల పక్షాన పోరాడుతామని, అలసత్వం వహిస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కాచం గురు ప్రసాద్, మాజీ కౌన్సిలర్లు జయంత్ లాల్, కొలనుపాక భద్రయ్య, నాయకులు పూర్ణ చారి, సంఘ పురుషోత్తం, పాలకుర్తి తిరుపతి, రాజేందర్ రెడ్డి, విజేందర్ రావు, పార్టీ కార్యకర్తలు, బూత్ అధ్యక్షులు పాల్గొన్నారు.

# ముస్త్యాలపల్లిని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుదా

## సర్పంచ్ మేకమల్ల వెంకటేష్



**వరంగల్ వాయిస్, నడికూడ :** గ్రామాభివృద్ధి లక్ష్యంగా పాలకవర్గ సభ్యులు సమన్వయంతో పనిచేయాలని ముస్త్యాలపల్లి సర్పంచ్ మేకమల్ల వెంకటేష్ పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని ముస్త్యాలపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ అధ్యక్షతన వార్డు సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో నెలకొన్న పలు సమస్యలపై సుదీర్ఘంగా చర్చించి, అభివృద్ధి పనులకు సంబంధించి కీలక తీర్మానాలను ఆమోదించారు. సమావేశం అనంతరం సర్పంచ్ వెంకటేష్ మాట్లాడుతూ.. గ్రామంలో మహిళా స్వయం సహాయక సంఘాలకు ప్రత్యేక భవనం లేక సభ్యులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, నూతన భవన నిర్మాణానికి తీర్మానం చేసినట్లు తెలిపారు. అలాగే, స్థానిక పాఠశాలకు ప్రహరీ గోడ లేకపోవడం వల్ల విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని, భద్రతా దృష్ట్యా వెంటనే ప్రహరీ గోడ నిర్మించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. గ్రామంలోని మౌలిక వసతులపై చర్చించిన పాలకవర్గం, ఈ క్రింది అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని నిర్ణయించింది. గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణను మెరుగుపరచడం, తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడటం. సీసీ రోడ్ల మరమ్మతులు, వీధి దీపాల ఏర్పాటును ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయడం, ప్రభుత్వం అందిస్తున్న ప్రతి పథకం అర్హులైన లబ్ధిదారులకు అందేలా వార్డు సభ్యులు బాధ్యత తీసుకోవడం. ప్రతి వార్డు సభ్యుడు తమ పరిధిలోని సమస్యలను గుర్తించి పంచాయతీ దృష్టికి తీసుకురావాలని సర్పంచ్ కోరారు. అందరి సహకారంతో ముస్త్యాలపల్లిని రాష్ట్రంలోనే ఒక ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో గ్రామ కార్యదర్శి దొంతుల కరుణ దేవి, ఉపసర్పంచ్ బొట్ల శ్యామల, వార్డు సభ్యులు బందెల కుమారస్వామి, బొట్ల శ్రీను, బొట్ల అరవింద్, బొట్ల లావణ్య, బందెల వెంకటేశ్వర్లు, పసుల మంజుల, బందెల రమ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# యువతలో సామాజిక చైతన్యం పెరగాలి

**లింగాయత్ సమాజ శ్రేయస్సుకు కృషి చేయాలి**

**జిల్లా అధ్యక్షుడు పట్నం శెట్టి వీర సోమయ్య**



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** యువత కేవలం చదువు, ఉద్యోగాలకే పరిమితం కాకుండా సామాజిక చైతన్యం కలిగి ఉండాలని వీరశైవ లింగాయత్ సంక్షేమ సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు పట్నం శెట్టి వీర సోమయ్య పిలుపునిచ్చారు. హనుమకొండలో నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని, ఇటీవల ఎన్నికైన యువజన కమిటీ ప్రతినిధులను ఉద్దేశించి ప్రసంగించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా గౌరవ సలహాదారు గుండవరం విధు మౌళి మాట్లాడుతూ.. కొత్తగా ఎన్నికైన యువజన, మహిళా కమిటీలు సంఘం బలోపేతంతో పాటు సేవా కార్యక్రమాలపై దృష్టి సారించాలని కోరారు. మాజీ అధ్యక్షులు నానం రాజయ్య, వుప్పు భాస్కర రావు మాట్లాడుతూ.. ఈ కమిటీల ద్వారా సంఘం మరింత పటిష్టమవుతుందని, నిర్మాణాత్మకమైన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. యువజన కమిటీ అధ్యక్షుడు వుప్పు శివకుమార్ (సునీల్) స్పందిస్తూ.. అందరి సహకారంతో త్వరలోనే భారీ రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తామన్నారు. మహిళా కమిటీ అధ్యక్షురాలు బానాల శ్రీ గౌరీ మాట్లాడుతూ.. సంక్రాంతి పండుగ సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ సమావేశంలో భీమదేవరపల్లి మండలం రత్నగిరి గ్రామం నుండి వార్డు సభ్యురాలిగా విజయం సాధించిన అస్పతి అనూష-సదానందం దంపతులను జిల్లా సంఘం పక్షాన ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్నం శెట్టి ఈశ్వరయ్య, బత్తుల రాజయ్య, శైలేష్ ప్రసాద్, గౌరీ శంకర్, పెనాల సమ్మయ్య, సర్వేశ్వరరావు, వెన్న కోటేశ్వరరావు, దుర్గం సమ్మయ్య, మహిళా ప్రతినిధులు సాయం ఉష, కొలగాని శోభ, ఉప్పు రజిత తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజా ఉద్యమాల అణచివేతకు కేంద్రం కుట్ర

◆ సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి




**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** దేశంలో గత 50 ఏళ్లుగా సాగుతున్న ప్రజా ఉద్యమాలపై నివేదిక కోరడం.. ఆ ఉద్యమాలను అణచివేయడానికేనని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ఆరోపించారు. బుధవారం స్థానిక వీరభవన్లో చింతకుంట్ల వెంకన్న అధ్యక్షతన జరిగిన సీపీఐ జిల్లా విస్తృత కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజా ఉద్యమాల అణచివేతకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాష్ట్రాల డీజీపీలను ఆదేశించడం రాజ్యాంగ విరుద్ధమని, ప్రజల ప్రాథమిక హక్కులను హరించడమేనని ఆయన మండిపడ్డారు. బీజేపీ ప్రభుత్వం దేశభక్తి ముసుగులో దేశ సంపదను అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ వర్గాలకు దోచిపెడుతోందని శ్రీనివాసరావు విమర్శించారు. కోట్ల ఏళ్ల చరిత్ర కలిగిన అరావళి పర్వతాలను మైనింగ్ కోసం అదానీ కంపెనీకి కట్టబెట్టడం పర్యావరణానికి గొడ్డలి పెట్టు అని అన్నారు. మోదీ అధికారంలోకి వచ్చాక దేశంలో పేదరికం, నిరుద్యోగం రెట్టింపు అయ్యాయని, పేదల సంక్షేమాన్ని విస్మరించి కేవలం ధనిక శక్తుల కోసమే కేంద్రం పనిచేస్తోందని ధ్వజమెత్తారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలోనూ, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన సాయుధ రైతాంగ పోరాటంలోనూ సీపీఐ పోషించిన పాత్ర చిరస్మరణీయమని ఆయన గుర్తు చేశారు. "దున్నేవాడికే భూమి" లక్ష్యంతో లక్షలాది ఎకరాలను పేదలకు పంచిన ఘనత సీపీఐదేనని అన్నారు. లౌకికవాదం, సామాజిక న్యాయం మరియు ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం వామపక్ష శక్తులు ఏకం కావాల్సిన సమయం ఆసన్నమైందని పిలుపునిచ్చారు. జనవరి 18న ఖమ్మం పట్టణంలో జరగనున్న సీపీఐ శత వార్షికోత్సవ ముగింపు భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని కార్యకర్తలకు, ప్రజలకు శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఈ సభ ద్వారా కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై గళమెత్తుతామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి, సహాయ కార్యదర్శి బి.అజయ్, నల్లు సుధాకర్ రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు కట్టెబోయిన శ్రీనివాస్, పెరుగు కుమార్, దేశపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, వరిపెల్లి ఎంకన్న, తండా సందీప్, చొప్పరి శేఖర్, బందు మహేందర్, సారిక శ్రీనివాస్, వీరవెల్లి రవి, వెలుగు శ్రావణ్, ఎండి ఫాతిమా, మేక వీరన్న, భానోత్ లింగ్యానాయక్, కొమ్ము నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధురాలి మృతి

**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద బుధవారం ఒక హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఓ వృద్ధురాలు ప్రాణాలు కోల్పోయింది. ములుగు జిల్లా పల్సబ్‌పల్లి గ్రామానికి చెందిన తోట రాధమ్మ (70) అనే వృద్ధురాలు వ్యక్తిగత పనుల నిమిత్తం పరకాలకు వచ్చారు. బస్టాండ్ లోపలికి వెళ్లే ప్రవేశ ద్వారం వద్ద ఆమె నడుచుకుంటూ వెళ్తుండగా, వరంగల్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు అకస్మాత్తుగా ఆమెను ఢీకొంది. ఈ ప్రమాదంలో రాధమ్మ బస్సు చక్రాల కింద పడటంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు, ప్రయాణికులు అక్కడికి చేరుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతురాలి వివరాలను సేకరించి బంధువులకు సమాచారం అందించారు. బస్టాండ్ ఆవరణలోనే ప్రాణాలు కోల్పోవడంతో ప్రయాణికులు దిగ్భ్రాంతికి గురయ్యారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# కోటగుళ్లను సందర్శించిన ఎంపీడీవోల బృందం

**గణపేశ్వరాలయ స్వామివారికి ప్రత్యేక పూజలు**



**వరంగల్ వాయిస్, గణపురం :** ప్రసిద్ధిగాంచిన కాకతీయుల చారిత్రక కళాక్షేత్రం, గణపురంలోని శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం (కోటగుళ్లు)ను బుధవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు చెందిన ఎంపీడీవోల బృందం సందర్శించింది. జిల్లాలోని వివిధ మండలాల్లో పనిచేస్తున్న ఎంపీడీవోలు చిట్యాల జయశ్రీ, టేకుమట్ల అనిత, మొగుళ్లపల్లి జి.సురేందర్, కాటారం ఎ.బాబు, గణపురం లంకపల్లి భాస్కర్ కలిసి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న అధికారుల బృందానికి అర్చకులు జూలపల్లి నాగరాజు సాదరంగా ఆహ్వానం పలికారు. అనంతరం వారు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాకతీయుల శిల్పకళా చాతుర్యాన్ని, ఆలయ విశిష్టతను ఈ సందర్భంగా వారు అడిగి తెలుసుకున్నారు. పూజా కార్యక్రమాల అనంతరం కోటగుళ్లు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఎంపీడీవోల బృందాన్ని శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఆలయ అర్చకులు వారికి వేదాశీర్వచనాలు అందజేసి తీర్థప్రసాదాలను వితరణ చేశారు. చారిత్రక సంపదను కాపాడుకోవడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు.

# ఘనంగా ఏఆర్ఎస్ఐ జైపాల్ రెడ్డి పదవీ విరమణ



**వరంగల్ వాయిస్,మామునూరు :** పోలీసు శాఖలో ఎలాంటి రిమార్క్స్ లేకుండా 41 సంవత్సరాల పాటు సుదీర్ఘ సేవలు అందించి పదవీ విరమణ చేయడం గొప్ప విషయమని మామునూరు 4వ బెటాలియన్ కమాండెంట్ శ్రీ డి. శివప్రసాద్ రెడ్డి కొనియాడారు. బుధవారం బెటాలియన్ ఆవరణలో ఏఆర్ఎస్ఐ వి. జైపాల్ రెడ్డి పదవీ విరమణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ వేడుకకు కమాండెంట్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పదవీ విరమణ పొందుతున్న జైపాల్ రెడ్డిని కమాండెంట్ శాలువాతో కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం జైపాల్ రెడ్డికి రావలసిన సీసీఎస్ నగదు మొత్తాన్ని చెక్కు రూపంలో కమాండెంట్ అందజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్లు శ్రీనివాస రావు, వీరన్న, రిజర్వు ఇన్స్‌పెక్టర్లు విజయ్, రవిసర్వర్, రాజ్ కుమార్, రామ్ ప్రసాద్‌లతో పాటు ఇతర అధికారులు, బెటాలియన్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని జైపాల్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

# క్యాలెండర్ ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, మేడ్చల్ :** మేడ్చల్ జిల్లా ముదుచింతలపల్లి మండలం ఉద్దెమర్రి గ్రామంలోని పురాతన శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం 2026 నూతన సంవత్సర క్యాలెండర్ల ఆవిష్కరణ వేడుక ఘనంగా జరిగింది. సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఈగ వెంకటేశ్వర్లు, ఆలయ చైర్మన్ గారు ముఖ్య అతిథులుగా హాజరై ఈ క్యాలెండర్లను ఆవిష్కరించారు. ముందుగా ఆలయంలో స్వామివారిని దర్శించుకున్న అనంతరం, వేద మంత్రోచ్చారణల మధ్య క్యాలెండర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ.. ఉద్యోగుల సంక్షేమం మరియు సామాజిక సేవా కార్యక్రమాల్లో సంఘం ఎల్లప్పుడూ ముందుంటుందని, నూతన సంవత్సరంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరందాస్ యాదగిరి, ఆర్గనైజేషనల్ సెక్రటరీ శిరందస్ యాదగిరెందర్, జాయింట్ సెక్రటరీలు కడవేరు లక్ష్మీపతి, పబ్లిసిటీ సెక్రటరీ దేవులపల్లి సాయిరాజ్, కార్యవర్గ సభ్యులు పబ్బతి విజయలక్ష్మి పాల్గొన్నారు. అలాగే హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు పున్న శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి చిలుక మధు, వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రపు రాజమౌళి, కోశాధికారి బుర్ర తిరుపతయ్య, నాయకులు పసన శ్రీనివాస్, శరత్ బాబు, కూర సత్యనారాయణ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# శివాజీ విగ్రహ ధ్వంసం అత్యంత దుర్మార్గం



**వరంగల్ వాయిస్, రాయపర్తి :** వరంగల్ జిల్లా రాయపర్తి మండలం బంధన్ పల్లి గ్రామంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని గుర్తుతెలియని దుండగులు కాల్చి ధ్వంసం చేయడం అత్యంత ఖండనీయమని, ఇది ఒక దుర్మార్గమైన చర్య అని బీజేపీ రాష్ట్ర నాయకులు, వరంగల్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు తీవ్రంగా మండిపడ్డారు. ఈ సందర్భంగా ప్రదీప్ రావు మాట్లాడుతూ.. ఛత్రపతి శివాజీ మహారాజ్ కేవలం ఒక వ్యక్తి కాదని, భారతీయ ఆత్మగౌరవానికి, హిందూ సంస్కృతికి మరియు ధర్మ రక్షణకు ప్రతీక అని కొనియాడారు. అటువంటి మహావీరుని విగ్రహాన్ని ధ్వంసం చేయడం అంటే దేశ సంస్కృతిపై దాడి చేయడమేనని అన్నారు. ఈ చర్య ద్వారా కాంగ్రెస్ నాయకులు తమ దేశభక్తి లేమిని, సంస్కృతిపై తమకున్న వ్యతిరేకతను మరోసారి బయటపెట్టుకున్నారని ఆయన విమర్శించారు. ఈ ఘటనపై ప్రభుత్వం మరియు పోలీసులు తక్షణమే స్పందించి, విగ్రహ ధ్వంసానికి పాల్పడిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. ఒకవేళ నిందితులను కాపాడే ప్రయత్నం చేస్తే బీజేపీ శ్రేణులు ఊరుకోబోవని, రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. విగ్రహాలను ధ్వంసం చేసినంత మాత్రాన శివాజీ మహారాజ్ ఆశయాలను, ఆయన పట్ల ప్రజలకున్న గౌరవాన్ని తగ్గించలేరని ప్రదీప్ రావు స్పష్టం చేశారు. ఆయన ఆదర్శాలు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని, ఇటువంటి విద్రోహ చర్యలను ప్రజలందరూ ఏకమై తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

# బాధితుల ఫిర్యాదులపై సత్వరం స్పందించాలి

◆ పరకాల ఏసీపీ సతీష్ బాబు

◆ దామెర పోలీస్ స్టేషన్ తనిఖీ



**వరంగల్ వాయిస్, దామెర:** పోలీసుల వద్దకు వచ్చే బాధితుల ఫిర్యాదులపై ఎల్లవేళలా సానుకూలంగా స్పందించి, వారికి సత్వర న్యాయం అందించాలని పరకాల ఏసీపీ సతీష్ బాబు సూచించారు. బుధవారం దామెర పోలీస్ స్టేషన్‌ను ఆయన వార్షిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏసీపీకి శాయంపేట సీఐ రంజిత్ రావు, దామెర ఎస్సై కొంక అశోక్ ఘనంగా స్వాగతం పలికారు. తనిఖీల్లో భాగంగా ఏసీపీ స్టేషన్ రికార్డులు, రిసెప్షన్ కౌంటర్, మెన్ బ్యారక్, కిట్ పరిశీలించడంతో పాటు స్టేషన్ పరిసరాలను తనిఖీ చేశారు. అనంతరం స్టేషన్ ఆవరణలో మొక్క నాటి, సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. వారి విధుల నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల్లో పోలీసుల పట్ల గౌరవం పెరిగేలా పారదర్శకంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. నేరాల నియంత్రణకు గ్రామాల్లో ప్రజలను చైతన్యపరిచి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేలా చూడాలని కోరారు. దామెర పోలీస్ సిబ్బంది పనితీరు పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేస్తూ అభినందించారు. డిసెంబర్ 31 రాత్రి నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని ఏసీపీ ఆదేశించారు. ముఖ్యంగా యువత మద్యం సేవించి వాహనాలు నడపరాదని, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అందరూ కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవాలని కోరుతూ మండల ప్రజలకు ఆయన నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

# నువ్వు నాకు నచ్చావ్.. నేడు రీరిలీజ్



'కొన్ని సినిమాలు డబ్బులు... మరికొన్ని సినిమాలు పేరునీ తీసుకొస్తాయి. గౌరవం మాత్రం చాలా కొన్ని సినిమాలే తీసుకొస్తాయి. 'నువ్వు నాకు నచ్చావ్' అలాంటి ఓ ప్రత్యేకమైన గౌరవాన్ని తీసుకొచ్చిన సినిమా అన్నారు ప్రముఖ దర్శకుడు త్రివిక్రమ్. ఆయన రచయితగా, విజయ్ భాస్కర్. కె దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రమిది. వెంకటేశ్, ఆర్తి అగర్వాల్ జంటగా నటించారు. స్రవంతి రవికిశోర్ నిర్మాత. ఈ చిత్రం జనవరి 1న రీరిలీజ్‌గా మరోసారి ప్రేక్షకల ముందుకొస్తోంది. ఈ నేపథ్యంలోనే చిత్రబృందం మంగళవారం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా నిర్మాత స్రవంతి రవికిశోర్ మాట్లాడుతూ ఈ సినిమా విడుదలై పాతికేళ్లయింది. ఇప్పటికీ 'నువ్వు నాకు నచ్చావ్' నిర్మాత అంటే నన్ను చూసే విధానం వేరుగా ఉంటుంది. ఈ సినిమా రూపొందడానికీ, ఇంత బాగా రావడానికి ప్రధాన కారణం వెంకటేశ్. నటుడిగా ఎంతో అద్భుతంగా చేశారు. ఇతర నటులు, దర్శకుడు విజయ్‌భాస్కర్, రచయిత త్రివిక్రమ్, సంగీత దర్శకుడు కోటి... ప్రతి ఒక్కరి అత్యుత్తమ పనితీరు ఇందులో కనిపిస్తుంది. అందుకే ఈ సినిమా ఇప్పటికీ అలా నిలిచిపోయింది. ఇప్పటిలా అప్పుడు ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ ఇతరత్రా దేశాల్లో విడుదల చేయలేదు. ఇప్పుడు మాత్రం అన్ని ప్రాంతాల్లోని ప్రేక్షకులూ చూసి ఆస్వాదించేలా భారీస్థాయిలో విడుదలకు సిద్ధం చేశాం' అన్నారు.త్రివిక్రమ్ మాట్లాడుతూ ఈ సినిమా క్రెడిట్ అంతా కథానాయకుడు వెంకటేశ్‌కే దక్కుతుంది. కథ చెప్పిన వెంటనే ఆయన చేస్తానని ముందుకొచ్చారు. అందరి జీవితాల్లో భాగమైన ఓ సినిమా ఇది. కుటుంబ ప్రేక్షకులంతా కలిసి ఓటీటీ, టీవీ మాధ్యమాల్లో చూశారు. సామూహిక అనుభవం కోసం అందరూ కలిసి మరోసారి థియేటర్లలో చూస్తారు' అన్నారు.






# ప్రభాస్ పెళ్లి మరునాడే నా పెళ్లి

## నవీన్ పొలిశెట్టి సరదా కామెంట్స్

టాలీవుడ్ యంగ్ హీరో నవీన్ పోలిశెట్టి మరోసారి తన హ్యూమర్‌తో ప్రేక్షకులను నవ్వించారు. సంక్రాంతికి విడుదల కానున్న తన తాజా చిత్రం 'అనగనగా ఒక రాజు' ప్రమోషన్ కార్యక్రమాల్లో భాగంగా నిర్వహించిన 'పెళ్లి రిసెప్షన్' ఈవెంట్‌లో మీడియా ప్రశ్నలకు చమత్కారంగా సమాధానాలు ఇచ్చారు. పెళ్లి గురించి ఎప్పటి నుంచో వస్తున్న వార్తలను ఎప్పుడు నిజం చేస్తారు? అని అడగగా.. ప్రభాస్ ఏ రోజైతే పెళ్లి చేసుకుంటారో, ఆ మరుసటి రోజు మధ్యాహ్నం 12 గంటలకు నేను పెళ్లి చేసుకుంటా అంటూ సరదాగా వ్యాఖ్యానించారు. ఈ కామెంట్స్ అక్కడున్న వారిని నవ్వుల్లో ముంచెత్తడమే కాకుండా సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ఇప్పటివరకు వివాహం చేసుకోలేదు. ఎప్పటికప్పుడు తన పెళ్లి ప్రస్తావన వాయిదా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభాస్ పెళ్లి ఇప్పట్లో జరిగే అవకాశాలు లేవని ఇన్‌డైరెక్ట్‌గా చెప్పిన నవీన్, ఇకపై తనను కూడా పెళ్లి ప్రశ్నలతో ఇబ్బంది పెట్టొద్దన్న సందేశం ఇచ్చినట్టయ్యింది. తనకు కాబోయే జీవిత భాగస్వామి గురించి మాట్లాడుతూ.. తనను ఎక్కువ ప్రశ్నలు అడగకూడదని, ఆమె కోసం తానే మారిపోతానని తెలిపారు. ఇక సంక్రాంతి బాక్సాఫీస్ పోటీపై స్పందించిన నవీన్ పోలిశెట్టి, మెగాస్టార్ చిరంజీవి చిత్రంతో పాటు తన సినిమా విడుదలవుతున్నా ఎలాంటి భయం లేదన్నారు. సామాన్య కుటుంబం నుంచి వచ్చి స్టార్‌గా ఎదగడానికి చిరంజీవి ఎంతోమందికి స్ఫూర్తి అని ప్రశంసించారు. చిరంజీవి నటించిన 'మన శంకర్ వరప్రసాద్ గారు' సినిమాను చూసేందుకు వచ్చే ప్రేక్షకులు తమ సినిమా 'అనగనగా ఒక రాజు' కూ వస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రం జనవరి 14న విడుదలకు సిద్ధంగా ఉండగా, నవీన్ కామెంట్స్‌తో సినిమాపై ఆసక్తి మరింత పెరిగింది. ప్రచారంలో భాగంగా 'అనగనగా ఒక రాజు పెళ్లి రిసెప్షన్' పేరుతో ఈవెంట్ నిర్వహించారు. అందులో నవీన్ పొలిశెట్టి సందడి చేశారు. మీడియా అడిగిన ప్రశ్నలకు సరదాగా సమాధానమిచ్చారు.




# టాక్సిస్ మూవీలో గంగగా నయనతార



యశ్ హీరోగా మలయాళ దర్శకురాలు గీతూమోహన్ దాస్ 'టాక్సిక్' చిత్రాన్ని తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. 'ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ అప్స్' అనేది ట్యాగ్ లైన్. ప్రస్తుతం దీని షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. తాజాగా ఈ సినిమాలో నయనతార లుక్‌ను టీమ్ రిలీజ్ చేసింది. ఇందులో ఆమె గంగ అనే పాత్రలో కనిపించనున్నారు. ఈ విషయాన్ని తెలుపుతూ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను పంచుకున్నారు. మోడ్రన్ డ్రెస్‌లో గన్ పట్టుకొని పవర్‌ఫుల్ లుక్స్‌తో నయన్ కనిపించారు. ఈ చిత్రంలో ముగ్గురు హీరోయిన్‌లు ఉన్నట్లు మొదటినుంచి వార్తలు వస్తున్నాయి. వాటిని నిజం చేస్తూ చిత్రబృందం ముగ్గురు హీరోయిన్ల లుక్‌లను వరుసగా విడుదల చేసింది. కియారా అద్వాణీ నదియా పాత్రలో కనిపించనుండగా హ్యూమా ఖురేషీ ఎలిజబెత్ పాత్రలో అలరించనున్నారు. చిన్నారుల కోసం ఎన్నో కథలు తెరకెక్కాయని, ఇది పెద్దలకు సందేశమిచ్చే చిత్రమని యశ్ ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. ఆయన 19వ చిత్రంగా 'టాక్సిక్' తెరకెక్కుతోంది. వచ్చే ఏడాది మార్చి 19న ప్రేక్షకుల ముందుకురానుంది. 'కేజీయఫ్' తర్వాత యశ్ నటిస్తున్న సినిమా కావడంతో దీనిపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి.

# హారర్ ఫాంటసీ కామెడీ..

## రాజాసాబ్ మొదటి సినిమా అన్న మారుతి



ఇప్పటివరకూ ఇండియన్ స్క్రీన్ మీద హారర్ ఫాంటసీ కామెడీ సినిమా రాలేదని రాజాసాబ్ డైరెక్టర్ మారుతి అన్నారు. రాజాసాబ్ మొదటి చిత్రం అవుతుంది. కథ రాయడానికి సంవత్సరం పట్టింది. ఏడాదిన్నర పాటు మేకింగ్.. పోస్ట్‌ప్రొడక్షన్‌కు కూడా 7 నెలలు పట్టింది. మొత్తం సినిమా నాలుగు గంటలకు పైగా వచ్చిందని మారుతి తెలిపారు. ది రాజాసాబ్' కథను చెప్పడానికి ప్రభాస్ దగ్గరకు వెళ్లినప్పుడు ఆయన 'ఆదిపురుష్' సెట్‌లో రాముడి గెటప్‌లో ఉన్నారు. వినోదాత్మక కథ ఉంటే చెప్పమన్నారు. హారర్ కామెడీ కథ ఉందని చెప్పా. ఆయన వెంటనే ఓకే అన్నారు. ఆయన ఓకే చెప్పిన తర్వాత నేను స్టోరీలో మార్పులు చేసి ఫాంటసీ ఎలిమెంట్స్ యాడ్ చేశానన్నారు. ఇటీవల జరిగిన 'ది రాజాసాబ్' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో దర్శకుడు మారుతి భావోద్వేగానికి గురైన విషయం తెలిసిందే. ప్రభాస్ గురించి చెబుతూ.. 'మీరు ఎదురుగా ఉంటే నా వల్ల కాదు..' అంటూ ఆయన భావోద్వేగంతో కన్నీరు పెట్టుకున్నారు. వెంటనే ప్రభాస్ వేదిక పైకి వచ్చి మారుతిని ఓదార్చారు. ఈ వీడియో సామాజిక మాధ్యమాల వేదికగా వైరలైంది. తాజాగా మారుతి ఓ ఇంటర్వ్యూలో దాని గురించి మాట్లాడారు. నేను ఆ సమయంలో ప్రభాస్ వేదిక పైకి వస్తారని అనుకోలేదు. నేను ఎమోషనల్ కాగానే ఆయన స్టేజ్ పైకి వచ్చి వెనకనుంచి హగ్ చేసుకున్నారు. వెంటనే 'సారీ డార్లింగ్' అని చెప్పా. 'ఫర్వాలేదు. ఈ కన్నీరు హృదయంలో నుంచి వచ్చేవి. నువ్వు ఎమోషనల్ అవుతావని ముందే ఊహించాను. నేను స్టేజ్ పైకి ఆలస్యంగా వచ్చాను. ముందే రావాల్సింది' అని ప్రభాస్ అన్నారు. ఎంత కంట్రోల్ చేసుకున్నా ఎమోషన్ ఆగలేదని మారుతి తెలిపారు.

# అగ్రంపహాడ్ జాతరకు పకడ్బందీ ఏర్పాట్లు

- ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి
- కలెక్టర్ తో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష





**వరంగల్ వాయిస్, అగ్రంపహాడ్ :** అగ్రంపహాడ్ శ్రీ సమ్మక్క, సారలమ్మ జాతరకు అధికారులు సమన్వయంతో పనిచేసి జాతరను విజయవంతం చేయాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి సూచించారు. బుధవారం హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం అగ్రంపహాడ్ లోని శ్రీ సమ్మక్క, సారలమ్మ ఆలయ ప్రాంగణంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ తో కలిసి జాతర ఏర్పాట్లు, నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం దేవాదాయ, రెవెన్యూ, పోలీస్, వైద్య ఆరోగ్య, విద్యుత్, ఆర్టీసీ, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి, సాగునీటిపారుదల, ఎక్సైజ్, అగ్నిమాపక, ఇతర శాఖల ఆధ్వర్యంలో చేయాల్సిన జాతర ఏర్పాట్ల గురించి ఎమ్మెల్యే, కలెక్టర్ సమీక్షించారు.

ఈ సమావేశంలో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ అగ్రంపహాడ్ శ్రీ సమ్మక్క సారలమ్మ జాతరకు పకడ్బందీ ఏర్పాట్లు పూర్తిచేసి ప్రశాంతంగా సాగే విధంగా అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలన్నారు. జాతరలో ఎలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట పోలీసు బందోబస్తు ఉండాలన్నారు. జాతరకు లక్షలాది మంది భక్తులు తరలి రానున్న నేపథ్యంలో వాహనాల పార్కింగ్ సమస్య తలెత్తకుండా తగిన స్థలాలను గుర్తించాలన్నారు. చుట్టుపక్కల రైతులతో మాట్లాడి పార్కింగ్ ఏర్పాటు చేయాలని, సంబంధిత రైతులకు రూ.5 వేల పరిహారం అందజేయాలన్నారు. జాతరకు వచ్చే రహదారుల్లో మూలమలుపులు ఎక్కువగా ఉన్నందున తగిన జాగ్రత్తలు చేపట్టాలన్నారు. భక్తులు స్నానాలు చేసే ఎస్సారెస్పీ కెనాల్ లో తగిన నీరు ఉండేవిధంగా చూడాలన్నారు. అదేవిధంగా అగ్రంపహాడ్ చెరువు వద్ద కూడా సాగునీటి పారుదల శాఖ అధికారులు ఏర్పాటు చేయాలన్నారు. జాతర లో గుడుంబా నియంత్రణ కు పోలీస్, ఎక్సైజ్ శాఖలు సంయుక్తంగా చర్యలు చేపట్టాలన్నారు. ఆలయ ప్రాంగణంలో పటిష్ట క్యూలైన్లు ఏర్పాట్లు చేయాలన్నారు. పారిశుధ్య నిర్వహణ మెరుగ్గా ఉండాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జాతరకు వచ్చే భక్తులకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. వచ్చేనెల 20వ తేదీన మరోసారి జాతర ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ తో కలిసి సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.

హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ జిల్లాలోనే అగ్రంపహాడ్ శ్రీ సమ్మక్క, సారలమ్మ జాతర..పెద్ద జాతర అని, ఈ జాతరకు సుమారుగా పది నుంచి 12 లక్షలు మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకునేందుకు వస్తారని అన్నారు. ఇక్కడ దర్శనం చేసుకున్న అనంతరం మేడారానికి భక్తులు తరలి వెళ్తుంటారని పేర్కొన్నారు. లక్షల సంఖ్యలో భక్తులు దర్శనం కోసం వస్తుంటారు కాబట్టి జాతరకు పటిష్ట ఏర్పాట్లు చేయాలన్నారు. జాతర ఏర్పాట్లు, నిర్వహణపై మరోసారి సమీక్ష చేయనున్నట్లు పేర్కొన్నారు. వివిధ శాఖలు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఆలయ ఈవో నాగేశ్వర్ రావు మాట్లాడుతూ జాతర నిర్వహణకు దేవాదాయ శాఖ తరపున ఏర్పాట్లు పూర్తి చేస్తామని అన్నారు. గతంలో 50 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని ఈ జాతరకు వంద సీసీ కెమెరాలను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ఈ సమావేశంలో పరకాల ఆర్డీఓ డాక్టర్ కన్నం నారాయణ, పరకాల ఏసీపీ సతీష్ బాబు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య, విద్యుత్ శాఖ ఎస్ఈ మధుసూదన్, పంచాయతీ రాజ్ ఈఈ ఆత్మారామ్, ఆర్టీసీ డీఎం దరంసింగ్, తహసిల్దార్ జగన్మోహన్ రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, ఇతర అధికారులతో పాటు అగ్రంపహాడ్, అక్కంపేట, చౌళ్లపల్లి సర్పంచులు మహేందర్, సాంబయ్య, రాజేశ్వరరావు, వివిధ గ్రామాల ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# సేవే పరమావధి..

☐ విశ్రాంత ఆచార్యులు గడ్డం భాస్కర్



**వరంగల్ వాయిస్, రెడ్డికాలనీ :** హనుమకొండ రెడ్డికాలనీలోని శ్రీ భక్త మార్కండేయ పద్మశాలి పరపతి సంఘం కార్యవర్గం సేవే పరమావధిగా ముందుకెళ్తుందని కాకతీయ యూనివర్సిటీ విశ్రాంత ఆచార్యులు గడ్డం భాస్కర్ అన్నారు. పద్మశాలి కులస్తుల్లో ఐక్యత సాధిస్తూనే.. సంఘటితం కోసం వీరు పడుతున్న ఆరాటం అభినందనీయమన్నారు. బుధవారం పరపతి సంఘం అధ్యక్షుడు, రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్షులు బత్తుల రమేష్ అధ్యక్షతన కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు బచ్చు ఆనందం మాట్లాడుతూ 2007లో ఏర్పాటైన శ్రీ భక్త మార్కండేయ పరపతి సంఘం ఇతర సంస్థలకు ఆదర్శంగా నిలిచిందని కొనియాడారు. ఈ సంఘం సేవా తత్పరతతో ముందుకు వెళుతోందని వరంగల్ వాయిస్ ఎడిటర్ గడ్డం కేశవమూర్తి, సీనియర్ జర్నలిస్ట్ పులికంటి రాజేందర్ అన్నారు. గత పుష్కరకాలంగా అనేక సేవా కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించిందని వారు కొనియాడారు. సంస్థ ఆదాయ, వ్యయాలు, చేసిన అభివృద్ధి గురించి సొసైటీ అధ్యక్షులు బత్తుల రమేష్ సోదాహరణంగా వివరించారు. శ్రీ భక్త మార్కండేయ పద్మశాలి పరపతి సంఘం శాశ్వత భవనం కోసం స్థల సేకరణ చేసి, తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ సందర్భంగా గడ్డం భాస్కర్, బచ్చు ఆనందం, గడ్డం కేశవమూర్తి, పులికంటి రాజేందర్, గుర్రపు రమేష్, నరెట్ల మహేందర్ తదితరులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు కోమాకుల కుమారస్వామి, గంజి రాజేందర్, దుంపేటి నరేందర్ బాబు, బేతి రమేష్, గోరంట్ల రాజకుమార్, కూచన సురేష్, లింగ బత్తుల సత్తయ్య, తేరాల శ్రీధర్, బత్తుల మహేందర్, కూరపాటి శ్రీనివాస్, కొంగ సారంగపాణి, కందగట్ల నరేష్, చెన్నూరి రాజు, దుంపేటి నవీన్ కుమార్ తోపాటు సంఘ సభ్యులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించండి

- ఎమ్మెల్యే నాగరాజుకు వినతి
- అసెంబ్లీలో సీఎం దృష్టికి తీసుకుపోవాలంటూ సూచన



**వరంగల్ వాయిస్, కేయూ :** పాత్రికేయులను విభజించు.. పాలించు అన్న చందంగా నూతనంగా తీసుకొచ్చిన జీఓ 252 ఉందని, దీనిని ఉపసంహరించుకోవాలని పలువురు జర్నలిస్టులు బుధవారం ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుకు విజ్ఞప్తి చేశారు. వరంగల్, హనుమకొండ జిల్లాల పరిధిలోని పలువురు జర్నలిస్టులు బుధవారం సుబేదారిలోని ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు క్యాంప్ కార్యాలయంలో ఈ మేరకు ఆయనను కలిసి వినతి పత్రం అందజేశారు. జర్నలిస్టు అక్రిడేషన్ కార్డులను కుదించడం ద్వారా నిజమైన సీనియర్ పాత్రికేయులు నష్టపోయే ప్రమాదం ఉందని సూచించారు. తమ సమస్యలను అసెంబ్లీ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. అనంతరం హాన్స్ ఇండియా న్యూస్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను మీడియా ప్రతినిధులు, పార్టీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే నాగరాజు ఆవిష్కరించారు. ఈ సమావేశంలో వరంగల్, హనుమకొండ జిల్లాలకు చెందిన పలువురు జర్నలిస్టు సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



# అంధకారంలో యూబీఐ

**వరంగల్ వాయిస్, హసన్ పర్తి :** గ్రేటర్ వరంగల్ 66వ డివిజన్ పరిధిలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియి, హసన్ పర్తి శాఖలో బుధవారం చీకట్లు అలుముకున్నాయి. గత కొంత కాలంగా విద్యుత్ బకాయిలు పేరుకు పోవడంతో విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. దీంతో బ్యాంక్ ప్రారంభమైనప్పటినుంచి చిమ్మ చీకట్లోనే బ్యాంకు సేవలను నిర్వహించాల్సి వచ్చింది. అయితే యూనియన్ బ్యాంక్, హసన్ పర్తి శాక విద్యుత్ బకాయిలు దాదాపుగా రూ.40 వేల పైనే ఉంటాయని సమాచారం. బ్యాంకులో విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో వినియోగదారులు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సెల్ ఫోన్ లనే విద్యుత్ దీపాలుగా మలుచుకుని కార్యకలాపాలు నిర్వహించారు. బ్యాంకు అధికారులే విద్యుత్ బిల్లులు చెల్లించకుండా బకాయిలు పడడంపై వినిగదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో బ్యాంకు అధికారులు అప్రమత్తమై విద్యుత్ అధికారులతో సంప్రదింపులు జరిపారు. వారికి నిర్దిష్ట హామీ ఇవ్వడంతో మధ్యాహ్నం తర్వాత బ్యాంకులో విద్యుత్తును పునరుద్ధరించారు.

# తీరని యూరియా కష్టాలు

☐ చల్లటి చలిలో భారీ క్యూలైన్లు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** యూరియా కోసం రైతులు నరకయాతన పడుతున్నారు. ఎముకలు కొరికే చలిలోనే అవస్థలు పడుతూ రైతు వేదికల వద్ద పడిగాపులు కాస్తున్నారు. వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం ఉప్పరపల్లి గ్రామంలో రైతు వేదిక వద్ద మంగళవారం రాత్రి నుంచే ఎరువుల కోసం బారులు తీరారు. ఎముకలు కొరికే చలికి దుప్పట్లు కప్పుకొని, స్వెటర్లు వేసుకుని టోకెన్ల కోసం రాత్రంతా రైతు వేదిక వద్ద జాగరణ చేశారు. వర్షాకాలంలో ఇబ్బందులు పడ్డా యాసంగి పంటకైనా సరిపడా యూరియా అందుతుందని ఆశతో మక్క, వరి పంటలు వేశామని, అయినప్పటికీ తిప్పలు తప్పడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో యూరియా కొరత లేదని.. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతోపాటు జిల్లా కలెక్టర్లు ప్రకటిస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. యూరియా నిల్వలు 47,68,000 బస్తాలు ఉన్నట్లు ప్రభుత్వం ప్రచారం చేస్తోందని, అంటే అంతా కలిపి 2.15 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే అవుతుందని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ లెక్కన రాష్ట్రంలో 12,700 గ్రామాలకు గానూ ఒక్కో గ్రామానికి అందుబాటులో ఉన్నది 376 యూరియా బస్తాలు మాత్రమే అంటే విమర్శిస్తున్నారు. ఇంతలా యూరియా కొరత ఉండటం కారణంగా రైతులు చలికి వణుకుతూ రైతు వేదికలు, సహకర సంఘాల వద్ద పడిగాపులు కాయాల్సిన దుస్థితి వచ్చిందని మండిపడుతున్నారు.

నూతన సంవత్సర శుభాకాంక్షలు
GWMC
వరంగల్ నగర ప్రజలకు, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బందికి, అధికారులకు నూతన సంవత్సర మరియు సంక్రాంతి పర్వదిన శుభాకాంక్షలు..
"వరంగల్ నగర అభివృద్ధే మాధ్యేయం - వరంగల్ ప్రజల ఆహ్లాదమే మా లక్ష్యం"
నగర ప్రజలు సకాలంలో ఇంటిపన్నులు, నీటి పన్నులు, ఇతర బకాయిలు చెల్లించండి.. నగరాభివృద్ధికి తోడ్పడండి.
నగరంలో పరిసిరాలను పరిశుభ్రంగా ఉంచండి.
స్వచ్ఛ వరంగల్ కు సహకరించండి.
GWMC సివిల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్
వరంగల్.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com